# మ న క వి

వొట్టి చీకటి దేముంది?

కాని చీకట్లో జరగటానికి వీలున్న ఘోరకృత్యాలూ, జరిగే ఘోర కృత్యాలూ, తలుచుకుంటే భయం. అందుకని ఆ వుళ్లో చీకటి, మిగిలిన వూళ్ళల్లో చీకటికంటె భయంకరంగావుంది. ఊరు, ఇళ్ళు-గుర్తుపెట్టి వరచ బడ్డ కార్పొరేషన్ మ్యాపులా వడివుంది. ఇళ్ళు స్మశానంలో ఆరిపోయిన కష్ఠాలా వున్నాయి. ఆకు ఆట్టంలేదు. చీకటి స్థంభించి పోయింది, ఊపిరే లేదు.

ఊపిరే లేదంటే, మానవుల్లో లేదు; ప్రకృతిలో లేదు. కాని వీటికి అతీతుడైన కవితో ఎందుకుండదు? అతడుగుండెలు జలధరించే ఆభయంలో చీకటిలో, ఇంటిలో వంటరిగా కూర్చొని కవిత్వ బాధ పడుతున్నాడు. ముక్కులు ఉబ్బించు కుంటున్నాడు. బాహ్యప్రపంచాన్ని మరచిపోతున్నాడు చూపుల్ని కేంద్రీకరించాడు. సిద్ధహస్తం—అంటే చేతిలో కలం.

అవి యుద్ధం రోజులు, ప్రపంచ యుద్ధం ప్రపంచం అతలాకుతలం అవుతూవుంది. ఆ ఊరూ జేరింది యుద్దంలో. అతన్ని కనుక్కోలేదు, తనిష్టంలేదు, అందుకనే మరీ భయం. కసాయివాడి దగ్గరకు గొర్రెతో పాటు, తోకా వెళ్ళింది. గొర్రెకంటె తోకకే భయం ఎప్పుడొస్తాడో! ఏం చేస్తాడో! బాంబులు వేస్తాట్ట! ఒక్క బాంబు కొన్ని మైళ్ళని బదాబదలు చేస్తుందిట?

మరొకటి ఆ వుళ్లో అలకాజనం జాస్తి. చీమలపుట్ట, ఆ పుట్ట బద్ధలై దోపిళ్ళు సాగించింది. ఒక షావుకార్ని హత్య చేసింది. అందుకనిఊరంతా వుడికిపోతూవుంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని, శరీరాలు యిళ్ళల్లో పెట్టుకొని కాలం గడుపుతూవుంది జనం చీకటి పడితేచాలు, బయటికి రావటానికి భయం, లోపల వుంటానికి భయం మాట్లాడటానికి భయం, ఊరుకోటానికి భయం, చావటానికి భయం, బ్రతకటానికి భయం, భయపట్టానికి

భయం, కాని కవికేం భయం? అంతా తన్మయత్వం—పరవశత్వం. అతని మెదడులో కలాలు కదిలినై. కళ్ళల్లో అక్షరాలు విరిసినై. సిరా ఎక్కడ? ఇంకెక్కడ? ఉదరములో! రాయటానికి ఉపక్రమించాడు.

ఓసి ప్రియురాలా....

గదిలోని వెలుతురు కదిలింది. కవి హృదయం చలించింది. ప్రియురాలా బాగుందా, ప్రేయసీ బాగుందా? ప్రేయసీలో ఎంత గాంభీర్యం, అగాధం వున్నాయి! భావములో కాదు—మాటలో భావాల్లో ఏముంది? అన్ని భావాలూ బట్టతల్లే ముగ్గు బుట్టలే! ప్రేయసీ ఊర్ధ్వలోకానికి లాక్కు-వెళ్తుంది! ప్రియురాలా పాతాళానికి గుంజుతుంది. కాని ప్రేయసీని అన్నలు వాడారే! అందుకని ప్రియురాలే—

ఓసి ప్రియురాలా?

పైన కవికి తోచలేదు. గిరజాలు గుంజుకున్నాడు. జుట్టు పీక్కున్నాడు, మళ్ళీ తదేక ధ్యానం.

అకస్మాత్తుగా పక్కింటిలో రివాల్వరు ప్రేలింది. ఢాం ఢాం ఢాం. ఏడ్పులూ, కేకలూ, ఆధ్వనుల్తో చీకటి ముక్కలు ముక్కలై తూట్లు తూట్లయ్ తెర పైకిపోయినట్లు కిందకు కూలింది. ప్రకృతిజలదరించింది. ఆకులు కదిలినై. పిట్టలు ఎగిరినై.

కవి విన్నాడు. కావలసింది. గ్రహించుకున్నాడు. అదే కవిలోవుంది—అందుకున్నాడు. చీకటిని చూశాడు. దీపాన్ని జరిపాడు. కలం పట్టుకున్నాడు మొహం విప్పారింది. జుట్టు గిరజాలై, గిరజాలు జుట్టయింది.

వ్రాశాడు:

ఓసి ప్రియురాలా!

నా

ఎదలోని ఎదవై

తుపాకి గుండువై....

మళ్ళీ ఆగింది. కవి లేచాడు. నిట్టూర్చాడు. చీకటిని ప్రార్థించాడు. పక్కింటిని చూశాడు. హోరెత్తే గుండెలు, తారెత్తె ఏడ్పులు—

దేవుడా దేవుడా
కాల్చేశార్రో
చంపేశార్రో

చీకటంతా ఏడ్చింది. బందిపోటుకి చీకటంటే యిష్టం గాని, చీకటికి బందిపోటంటే యిష్టంలేదు. అందుకని హోరున ఏడ్చింది. కవి హృదయం గంతులేసింది. చిరునవ్వు నవ్వాడు. ఆ నవ్వు చీకటికంటే నల్లగావుంది. టేబిల్ దగ్గరకు వెళ్ళాడు. కలం తీశాడు, కలం పద్యాన్ని పూర్తి చేసింది!

ఓసి ప్రియురాలా
నా
ఎదలోని ఎదపై
తుపాకి గుండువై
సన్నేల
కాల్చెదవు?
నన్నేల
మాడ్చెదవు!!

పక్కింటిలో ఏడ్పులు ఎక్కువైనయ్. పిట్టల కాకి గోల-చీకటి చిందులు-ప్రకృతి వికటాట్టహాసం- గోల గోల. ప్రళయం వస్తుందా!

మన కవిమాత్రం పాట పూర్తయ్యిందనే తృప్తితో, తృప్తిని పరుద్దామని పరున్నాడు-ఏ పేపరుకి పంపుదామా అని ఆలోచిస్తూ నిద్ర పోయాడు. నిద్రలో పూరుకుంటాడా? పూరుకోడు, మేలుకుంటాడు.

పక్కింట్లో? దాని సంగతేమిటి?
అది మనుష్యుల పని.
కవుల పని కాదు.
ఆ పద్యాలు ప్రకటించే వార్తాపత్రికల పని కాదు.